# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-05-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **'ఆపరేషన్ సింధూర్'లో భారత సైన్యం సాహస, పరాక్రమాలు ప్రదర్శించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు.**
2. **గిరిజన ప్రాంతాల్లో స్థానికులకే ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.**
3. **తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత నిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్య సదుపాయాలను కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ వెల్లడించారు.**

=========================

పాకిస్తాన్ లోని ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా  నిర్వహించిన ఆపరేషన్ సింధూర్‌లో భారత సైన్యం సాహస, పరాక్రమాలు ప్రదర్శించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. ఆపరేషన్ సింధూర్ అనంతరం తొలిసారిగా గత రాత్రి జాతి నుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, భారత సైన్యం ప్రదర్శించిన శక్తి సామర్థ్యాలకు తాను వందనం చేస్తున్నానని అన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్, ఉగ్రవాద నిర్మూలన అన్న అంశాల ఆధారంగానే ఇకపై పాకిస్తాన్‌తో చర్చలు జరుగుతాయని, ఉగ్రవాదం, చర్చలు రెండూ ఏకకాలంలో జరగవని పేర్కొన్నారు. ఉగ్రవాదం, నీటి పంపిణీ ఒకే కాలంలో ఉండవని  ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ  పేర్కొంటూ ....

వాయిస్..  39 సెకన్లు

--------------------------

మారుమూల గిరిజన ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి  నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు, విద్య-వైద్య సదుపాయాలు కల్పిస్తూ, ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు

కల్పించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో 2000 ఏడాదిలో జీ.వో నెంబర్ 3 తెచ్చామని గుర్తు చేశారు. న్యాయ సమీక్షలో రద్దయిన జీవో నెంబర్ 3 పునరుద్దరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను ఆయన నిన్న ప్రారంభించి మాట్లాడారు. సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్, కృత్రిమ మేధా డేటా కేంద్రాలు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిందని ముఖ్యమంత్రి పేర్కొంటూ

వాయిస్ ...25 సెకన్లు

---------------------------

వర్షాకాలం రానున్న దృష్ట్యా మురుగు కాలువల్లో పూడిక తీయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి పుర, నగరపాలక సంస్థల కమిషనర్లతో దృశ్యమాద్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాలువల వద్ద వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. వర్షాలు పడే వరకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్న క్యాంటీన్లలో తనిఖీలు నిర్వహించి ఆహార నాణ్యత పరీక్షించాలని, నగరాలలో రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటించాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

వారసత్వ సంపద, సాంస్కృతిక కళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుద్ధ జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా ఘంటసాలలోని బౌద్ధ స్తూపాన్ని, శయన బుద్ధ నిర్మాణాలను స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, పార్లమెంట్ సభ్యులు బాలశౌరిలతో కలిసి నిన్న దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, శాంతికి మారు పేరు గౌతమ బుద్ధుడని, వేల ఏళ్లనాటి స్తూపం ఘంటసాలలో ఉండటం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. కృష్ణా జిల్లాను ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత నిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం మేడపాడు సమీపంలోని పెనుమర్రులో పంట కాలవ నిర్మాణానికి, రహదారి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ..

..వాయిస్..25 . సెకన్లు

---------------------------

ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు ధీటుగా సమాధానమిచ్చిన దేశ సైన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి

దైవబలం  ఉండాలని కోరుతూ జనసేన పార్టీ  ఆధ్వర్యంలో  షణ్ముఖ క్షేత్రాలు, ఇతర ఆలయాల్లో ఈ రోజు పూజలు చేయనున్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కె పవన్‌కల్యాణ్ నిర్ణయం మేరకు జనసేన శాసనసభ్యులు, నాయకులు, పార్టీ శ్రేణులు ఆయా ఆలయాలకు వెళ్లారు. తమిళనాడులోని ఆరు మురుగన్ దేవాలయాలతో పాటు కర్ణాటకలో రెండు, ఆంధ్రప్రదేశ్‌లో రెండు సుబ్రహ్మణ్య క్షేత్రాలు, విజయవాడ ఇంద్రకీలాద్రి, పిఠాపురం పురూహూతిక ఆలయాల్లో పూజలు చేయనున్నారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్య సదుపాయాలను కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఆసుపత్రి భవన నిర్మాణానికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26 కోట్ల రూపాయలతో రెండేళ్లలో పరిగి ప్రజలకు కొత్త ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఆసుపత్రిలో అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలతో పాటు మూత్రపిండాల బాధితులకోసం డయాలసిస్ కేంద్రంలో పడకలు, మిషన్ల సంఖ్య పెంచే ప్రక్రియను ప్రారంభించామని మంత్రి వివరించారు.

---------------------------

వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు ఆర్థిక చేయూత  లభించేంలా చర్యలు చేపడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో సుమారు 21 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనానికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు  ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.  ఈ సంఘం ద్వారా రైతులు సులభంగా పంటల పెట్టుబడి రుణాలు పొందడంతో పాటు, ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని మంత్రి వివరించారు.

---------------------------

మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్ లో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నిన్న 30 దేశాలకు చెందిన పోటీ దారులు నాగార్జున సాగర్ లోని బుద్ధవనాన్ని సందర్శిం చారు. బౌద్ధమతంపై విశ్వాసం, బుద్ధుని చరిత్ర తెలిపేలా రూపొందించిన బౌద్ధ థీమ్‌పార్క్  స్తూపాన్ని పరిశీలించారు. అనంతరం బుద్ధుని విగ్రహాల చెంత జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ఆయా దేశాల ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని గత రాత్రి గరుడసేవను నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి నాడు మలయప్ప స్వామి వారు గరుడ వాహనంను అధిరోహించి భక్తులను కటాక్షించడం ఆనవాయితీగా వస్తోంది. వైశాఖ పౌర్ణమి రాత్రి సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

=====================